క్లుప్తంగా

పండ్లు పంపిణీ



కడప కార్పొరేషన్: కడప నగరం జిల్లా పరిషత్ ఆవరణలోని ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో శ్రీ గాయత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువకేంద్ర సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ నేత గోవిందు నాగరాజు, మహిళా మండలి అధ్యక్షురాలు నారాయణమ్మ, సభ్యులు పద్మావతి, లక్ష్మిదేవి, సుభద్రమ్మ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప రూరల్ : జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను బుధవారం స్థానిక తన నివాసంలో కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పి ఖాదర్ బాషా, సభ్యులు సాయికుమార్, అబ్దుల్లా, రెహమాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని పటిష్టం చేయడానికి ప్రతి ఒక్కరి కృషి అవసరం

కడప కార్పొరేషన్: జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడానికి ప్రతి ఒక్కరి కృషి అవసరమని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. బుధవారం బీహెచ్ ఇలియాస్‌ను కడప నార్త్‌జోన్ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా ఆయన అంజద్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా బీహెచ్ ఇలియాస్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతను క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో నెరవేరుస్తానన్నారు. తనకు పదవి ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జమాల్‌వలీ, షఫీ, అజ్మతుల్లా, జిలాన్, అన్సర్, గయాజ్, అన్వర్, ఫారూఖ్, అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నప్పుడే పెద్ద పండుగ

కడప కార్పొరేషన్: ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నప్పుడే పెద్ద పండుగ అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్ బాషా, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్, కార్పొరేటర్ షంషీర్, పార్టీ నాయకులు గౌస్, ఫయాజ్, సమీర్ తదితరులు ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

ఘనంగా గ్రామోత్సవం

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి గ్రామోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈవేడుక నిర్వహించినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఆలయ ప్రధాన ఉపప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. గండి పురవీధులతో పాటు వీరన్నగట్టుపల్లెలో ఊరేగింపు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఆర్కేవ్యాలీ పోలీసులు బందోబస్తు నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్‌లు వెంకటస్వామి, వీరభాస్కరుడు, భక్తులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కడప అర్బన్: కడప నగరంలోని ఎస్పీ బంగళా సమీపంలో ఈనెల 3వ తేదీన రోడ్డును దాటుకుంటున్న శ్రీనివాసులు (53) అనే వ్యక్తిని స్కూటీతో ఢీకొనడంతో గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి, తన బంధువుల సహాయంతో ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందారు. తరువాత రిమ్స్‌లో మెరుగైన వైద్యం కోసం చేరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కడప ఒన్‌టౌన్ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

వైభవంగా చెన్నకేశవుడి కల్యాణం

పెండ్లిమర్రి: మండలంలోని వెల్లటూరు గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం మకర సంక్రాంతి రోజున శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వస్వామి కల్యాణం ఆలయ ఈఓ శ్రీనువాసులు, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కన్నులారా తిలకించారు. అనంతరంగ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

పతంగుల సందడి

కడప నగరంలో సంక్రాంతి వేడుకలలో భాగంగా మైదానాలలో పతంగుల సందడి నెలకొంది. మునిసిపల్, ఆర్ట్స్ కళాశాల, సీఎస్ఐ గ్రౌండ్, మరియాపురం గ్రౌండ్, రామకృష్ణ కాలేజ్ గ్రౌండ్ లలో చిన్నారుల నుంచి పెద్దల వరకు గాలి పటాలు ఎగర వేస్తూ కనిపించారు. వివిధ రకాల గాలిపటాలతో పిల్లలు ఉత్సాహంగా మైదానాల బాట పట్టి.. నా గాలిపటం చూడు.. ఎంత ఎత్తున ఉందో.. అంటూ సందడి చేశారు. ఈ చిత్రాలు నగరంలోని మునిసిపల్ మైదానంలోనివి.

– ఫొటోలు సాక్షి ఫొటోగ్రాఫర్







పార్వేట ఉత్సవం



కడప కల్చరల్ : సంక్రాంతి కనుమ పండుగలో భాగంగా బుధవారం కడప నగరంలో పలు దేవాలయాలకు సంబంధించి పార్వేట ఉత్సవాలను ఉల్లాస భరితంగా నిర్వహించారు. కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం వద్ద నగరానికి చెందిన మరో రెండు దేవాలయాల పార్వేట ఉత్సవాలు నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయమేగాక గడ్డిబజారులోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం, పెద్దదర్గా వద్దగల శ్రీ రుక్మిణిపాండు రంగ స్వామి ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లను మున్సిపల్ మైదానంలోకి ఊరేగింపుగా తీసుకొచ్చారు. మూడురోజులపాటు పండుగ సందర్భంగా భక్తుల పూజలందుకున్న స్వామి, అమ్మవారితోసహా ఆటవిడుపుగా అడవిలోకి వేటకు వచ్చాడని అర్చకులు పేర్కొన్నారు. పార్వేట అనంతరం పూజలు నిర్వహించారు.





శిల్పారామంలో సంబరాలు

కడప కల్చరల్: కడప శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు మంగళ, బుధ వారాల్లో వైభవంగా నిర్వహించారు. ఐదు రోజులుగా ఈ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శిల్పారామం సంప్రదాయ వేదికపై చిన్నారులకు గాలిపటాలు ఎగురవేసే పోటీ నిర్వహించారు. పలువురు చిన్నారులు ఈ పోటీలో ఉత్సాహ భరితంగా పాల్గొని గంతులు వేస్తూ గాలిపటాలను ఎగురవేశారు. అనంతరం సంక్రాంతి పండుగ సంప్రదాయాల్లో భాగంగా గంగిరెద్దుల ఆట ప్రదర్శన ఉత్సాహ భరితంగా సాగింది. గంగిరెద్దులతో నృత్యం చేయించడం, వాటికి కల్యాణం చేయడం తదితర అంశాలు ఆకట్టుకున్నాయి.

నృత్యకారుడు అంజిబాబు ఆధ్వర్యంలో యువ బృందాలు తప్పెట వరుసను ప్రదర్శించి ప్రజల్లో ఉల్లాసం కలిగించారు. అనంతరం జరిగిన నృత్య కార్యక్రమాల్లో ఎంపిక చేసిన సంక్రాంతి పాటలతో సందర్శకులను ఆకట్టుకున్నారు.

శుభాకాంక్షలు

కడప కార్పొరేషన్: సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబులకు మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఉదయం ఆయన వారిని వేర్వేరుగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. అందుకు ప్రతి గా మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబులు అంజాద్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపి, ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, రామలక్ష్మణ్‌రెడ్డి, షఫీ, అజ్మతుల్లా, యల్లారెడ్డి, నిరంజన్, మాదవ్, ఆర్వీ రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మేయర్ సురేష్ బాబును సన్మానిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ప్రతి ఇంట్లో సిరులు నిండాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి గుమ్మంలో సంక్రాంతి లక్ష్మీ కొలువై ప్రతి కుటుంబంలో సంతోషాల సిరులను నింపి భోగభాగ్యాలను ప్రసాదించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. మూడు రోజుల సంక్రాంతి వేడుకల్లో భాగంగా మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులతో కలిసి మకర సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. హరిదాసుల సందళ్ళతో బంగ్లాలోకి వచ్చిన గంగిరెద్దుకు జిల్లా కలెక్టర్ దంపతులు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి సంప్రదాయబద్ధంగా పూజలు చేసి గంగిరెద్దుల యజమానికి సంక్రాంతి కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ×సంక్రాంతి పండుగ మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగని, వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చే ఈ పండుగలో గంగిరెద్దులు, వాటి యజమానులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వారిని గౌరవించడం మనందరి బాధ్యత అన్నారు. వ్యవసాయా ధారిత జీవనం సాగించే తెలుగు రాష్ట్రాలలో సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందని, కొత్త పంటలు చేతికందిన రైతులు, ఇంటినిండా ధాన్య సిరుల సంపదల మధ్య ఆనందంగా జరుపుకునే పండుగే ఈ సంక్రాంతి అన్నారు. సనాతన సంప్రదాయాలను గుర్తుకు తెచ్చి, అల్లుళ్ళు, బంధుమిత్రులతో సరదాగా చేసుకునే పండుగే సంక్రాంతి అన్నారు. ఈ ఏడాది ప్రకృతి అన్నివిధాలా కరుణించి జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి సిరుల పంటలు పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



గంగిరెద్దుకు పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి దంపతులు

బండలాగుడు పోటీలు



కడప కల్చరల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కడప నగరంలోని మరియాపురంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ పండుగ సంబరాల్లో భాగంగా పెద్ద ఎత్తున ఎద్దులచే బండలాగుడు పోటీలను నిర్వహించడంపై నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. పోటీల అనంతరం గెలుపొందిన వారికి అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారుల వింత పోకడ

- ఫ్లెక్సీల ఏర్పాటుపై ద్వంద్వ వైఖరి
- వెల్లువెత్తుతున్న విమర్శలు

కడప కార్పొరేషన్: 'అయిన వారికి ఆకుల్లో, కాని వారికి కంచాల్లో'... 'వడ్డించేవాడు మనోడైతే'... వంటి సామెతలు టౌన్‌ప్లానింగ్ అధికారులకు అతికినట్టు సరిపోతాయి. కడప నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న వారిపట్ల టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇదే తరహా వైఖరిని అవలంబిస్తున్నారు. తమకు నచ్చినవారి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఎన్ని రోజులైనా అలాగే ఉంచుతున్నారు. నచ్చని వారివైతే వెంటనే పీకేస్తున్నారు. ఇదంతా స్థానిక ఎమ్మెల్యే మాధవీ రెడ్డి ఆదేశాలతోనే జరుగుతోందన్న చర్చ సర్వత్రా వినిపిస్తోంది. ఈనెల 9వ తేది పాలెంపల్లెకు చెందిన అధికార పార్టీ నేత పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు నగరమంతా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలకు అనుమతి లేదన్న సాకుతో టౌన్‌ప్లానింగ్ అధికారులు అదేరోజు ఆ ఫ్లెక్సీలను, బ్యానర్లు పీకేశారు. ఒక్కరోజు ఉంచి తర్వాతి రోజు తీసేయాలని ఆ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారు ఎంత బతిమాలినా అధికారులు వినిపించుకోలేదని తెలుస్తోంది. ఆ ఫ్లెక్సీల్లో కొన్నిచోట్ల మంత్రి లోకేష్ ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ఫోటో లేకపోవడం వల్లే ఆ ఫ్లెక్సీలను వెంటనే తీసేయించారనే ప్రచారం నడుస్తోంది. తాజాగా సంక్రాంతి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే మాధవీ ఆధ్వర్యంలో నగరమంతా ఫ్లెక్సీలు వెలిశాయి. వీటిలో ఎక్కడా ముఖ్యమంత్రి ఫోటో కూడా లేదు...పైగా వేటికి కూడా నగరపాలక సంస్థ అనుమతి లేదని తెలుస్తోంది. అయినా వీటిని తొలగించేందుకు ఏ ఒక్క అధికారి సాహసించలేదు. దీన్ని బట్టి స్థానిక ఎమ్మెల్యేనే తమ ఫ్లెక్సీలను తొలగింపజేశారన్న విషయం అధికార పార్టీ నేతలకు ఆలస్యంగా అర్థమైనట్లు సమాచారం. తరతమ బేధం లేకుండా అధికారులు వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని పలువురు పేర్కొంటున్నారు.



ఈనెల 9వ తేది టీడీపీ నేత ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



సంక్రాంతి సందర్భంగా ఎమ్మెల్యే మాధవి ఫొటోలతో వేసిన ఫెక్సీలు

ఉర్దూ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో పిపి 1, పి పి 2 తరగతులు ప్రారంభించాలని రూట రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో కనీసం 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. బుధవారం కడప నగరంలోని నగరపాలక ఉర్దూ పాఠశాల (సాలె నాగయ్య)లో రూట జిల్లా శాఖ కార్యవర్గ సమావేశాన్ని రూట జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ , జిల్లా ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మైనర్ మీడియా ఉర్దూ ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:15 గా ఉంచాలని, 45 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

రూట వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా మాట్లాడుతూ ఉర్దూ కాంప్లెక్స్‌లను యధావిధిగా పాత స్కూల్ కాంప్లెక్స్‌లలోనే నిర్వహించాలన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్తార్ ఫైజీ, షాహిదుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలలో 20 మంది మైనార్టీ విద్యార్థులు ఉన్నచోట రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ మంజూరు చేసి భర్తీ చేయాలన్నారు, రాష్ట్ర డైరీ కమిటీ ఛైర్మన్ హాజీ అబ్దుల్ హకీం సాహెబ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అఫ్జల్ బాష మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్టుమెంట్‌ను రెగ్యులర్ చేసి ఉర్దూ ఆచార్య పోస్టులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ మస్తాన్ వలి, బేపారీ ఫక్రుద్దీన్‌లు మాట్లాడుతూ ఉర్దూ విద్యాసంస్థల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ , డైరీ కమిటీ ఛైర్మన్ హాజీ అబ్దుల్ హకీం సాహెబ్, వైఎస్ఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్, ఆర్థిక కార్యదర్శి కరామతుల్లాలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి మఖ్బూల్ అహ్మద్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అయ్యూబ్, జిల్లా నాయకులు ఖాదర్ బాషా, అబ్దుల్ ముజీబ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూట రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్

వైభవంగా అయ్యప్పస్వామి మహోత్సవం



తిరువాభరణ మహోత్సవంలో అయ్యప్ప దీక్షదారులు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానదీ తీరంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా అయ్యప్పస్వామికి శభరిమలై వలే తిరువాభరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువ జామున అయ్యప్పస్వామికి విశేష పూజాకార్యక్రమాలను చేశారు. మంగళవారం సాయంత్రం ఇరుముడి కట్టుకున్న అయ్యప్పదీక్షదారులు శబరిమలలో స్వామివారికి జరిగే విధంగా తిరువాభరణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అయ్యప్పస్వామి ఆభరణాలకు ప్రత్యేక పూజలు చేసి దీక్షదారులు తలమీద ఉంచుకుని ఊరేగింపుగా శరణు ఘోషల మధ్య శివాలయం చేరుకున్నారు.

అక్కడ స్వామి వారి ఆభరణాలకు పూజాక్రమాలు చేసి తిరిగి, ఊరేగింపుగా అయ్యప్పస్వామికి ఆలయానికి చేరుకుని స్వామివారికి అలంకరించారు. అనంతరం అయ్యప్పస్వామి జ్యోతి పూజ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. పూజాకార్యక్రమం కొవ్వూరు రామసుబ్బారెడ్డి, రమేష్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో అయ్యప్పస్వామి, అమృతేశ్వరస్వామి ఆలయ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మానుషం

సంక్రాంతి సందర్భంగా రోడ్లన్నీ బోసిపోయాయి. సెలవులు కావడంతో చాలా మంది పల్లెలోగిళ్లకు చేరుకున్నారు. దీంతో రద్దీగా ఉండే కడప నగరంలోని ప్రధాన కూడళ్లన్నీ జనసంచారం లేక బోసిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప